


# టాగోర్ కథలు

తెలుగు సేత :చంద్రలత



# సుభా

## రవీంద్రనాథ టాగోర్

సుభా (బెంగాలీ,1892)



సుభాషిణి అని పేరు పెట్టినపుడు, ఆ పసిపాపాయి పుట్టుమూగ అని ఎవరు ఊహించారు? ఆ చిన్నారి అక్కలు సుకేశిని, సుహాసిని. ఆ వరసలోనే ఈ పురిటిబిడ్డకు సుభాషిణి అని పేరుపెట్టాడు వాళ్ళ నాన్న. సుభా అన్నది ఆ చిట్టితల్లి ముద్దు పేరు. సాధారణంగా అయ్యే పెళ్ళిఖర్చుల ఇబ్బందులతో, ఆమె అక్కలు ఇద్దరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఇక, మిగిలిన ఈ చిన్నకూతురు నిశ్శబ్దంగా అమ్మానాన్నల గుండెలమీది బరువై ఉంది.

సుభా మాట్లాడలేదు కాబట్టి, లోకులంతా ఆమెలో ఎటువంటి భావోద్వేగాలు ఉండవనుకొంటారో లేక భావాతీతురాలు అని అనుకుంటారేమో గానీ, సుభా ఎదురుగానే ఆమె గురించి వారి ఆందోళనలన్నీ ఎలాంటి దాపరికం లేకుండా వ్యక్తంచేస్తూ ఉంటారు. అలా చాలా చిన్నతనంలోనే సుభా, దేవుడు తనను తన పుట్టింటివారికి ఒక శాపంలా పంపించాడని అర్థం చేసుకొంది. అందుకనే, తనను చుట్టుముడుతున్న సాధారణవ్యక్తులందరికీ దూరంగా జరిగింది. తనలోకంలో తాను జీవించ సాగింది. వాళ్ళందరి గురించి ఆమె పూర్తిగా మరిచిపోయినపుడే ఆమె తన శారీరక వైకల్యాన్ని భరించగలదు. అయినా, మనసుకు కలిగిన నొప్పిని ఎలా మరిచిపోగలదు?

రాత్రింబవళ్ళు సుభా అమ్మానాన్నలకు ఆమె గురించే దిగులు. ముఖ్యంగా వాళ్ళ అమ్మ, సుభా తనలో ఉన్న లోపానికి ప్రతిరూపమని అనుకోసాగింది. తల్లికి కొడుకుకన్నా కూతురు తనలో ఒక భాగంగా అనిపించడం సహజమే. సుభా వైకల్యం తల్లికి నిత్యం జరిగే అవమానాలకి మూలం.

సుభా నాన్న వాణికంతుడు (బాణికాంతో), మిగిలిన ఇద్దరు కూతుళ్ళ కన్నా సుభాని ఎక్కువ ప్రేమించేవాడు. సుభాతల్లి సుభాని తన శారీరక వైకల్యంలా, తన వంటి మీది అసహజమైన మచ్చలా భావించేది.

సుభాకి మాటలు మూగవైనా, ఆమెకు పెద్ద నల్లని కనుదోయికి తక్కువేమీ లేదు. తీరైన ఆ కళ్ళకి పొడవాటి వంపు వంపు తిరిగిన కనురెప్పలు. ఆమె మదిలోని ఆలోచనలకు స్పందిస్తున్నట్లుగా కదిలే చిగురాకు పెదవులు. సుభా పెద్ద పెద్ద కళ్ళకి మరింత సొగసును దిద్దాయి.

మన ఆలోచనలను పదాలలో వ్యక్తపరిచే మాధ్యమం అంత సులువుగా దొరకదు. ఆ ఆలోచలను అన్వయించుకొనే పద్ధతి ఏదో ఉంటుంది కాబోలు. అందుకే కాబోలు, తరుచు తప్పులు చేస్తుంటాం. పొరపాటుగా వ్యక్తపరుస్తుంటాం. కానీ, నల్లని నయనాలకు ఎటువంటి వ్యాఖ్యానం అక్కరలేదు. మనసే వాటి మీద నీడలు పరుస్తుంది. వాటిలోనే ఆమె ఆలోచన తెరుచుకొంటుంది లేదా మూసుకుపోతుంది. వెలుగులు చిమ్ముతుంది లేదా చీకట్లోకి జారుకొంటుంది. అస్తమిస్తున్న జాబిల్లి లాగా వేళ్ళాడబడుతుంది, లేదా వేగంగా కదులుతూ విశ్రాంతి లేకుండా ఆకాశమంతా వెలుగులు వెదజల్లుతూ ఉంటుంది.

పుట్టుకతోనే కంటిబాస తప్ప వేరే భాష తెలియని వారికి పెదవుల వణుకే కనులభాషను నేర్పిస్తుంది. భావవ్యక్తీకరీణకు అంతే లేదు. సముద్రమంత లోతుగా, స్వర్గమంత స్వచ్ఛంగా ఉంటుంది. ఉదయ సాయంకాలాలు వెలుగునీడలు. మూగవారిలో ప్రకృతికే స్వంతమైన ఏకాంతదర్పం నిండి ఉంటుంది.

ఏది ఏమైనా, సుభా ఈడుపిల్లలు ఆమె వాలకానికి బెదిరినట్లుగా చెదిరిపోయేవారు. ఆమెతో ఆడుకోవడానికి ఎప్పుడూ వచ్చేవారే కాదు. తమ జట్టు చేరనిచ్చే వారు కాదు. స్నేహితులు లేని సుభా ఎప్పుడూ మౌనంగానే ఉండేది, మధ్యాహ్నపు అలలపోటులాగా.

సుభా నివసించే పల్లె పేరు చండీపూర్. ఆ ఊరి నది బెంగాల్ నదులతో పోలిస్తే చాలా చిన్నది. అటూ ఇటూ సన్నని ఒడ్డుల నడుమ ఒదొగొదిగి ఉండేది, మధ్యతరగతి అమ్మాయిలాగా.

ఎంత వేగంగా పరుగులు తీసినా, ఆ నీటి పాయ ఏనాడు ఒడ్డుని దాటి పొంగిపొర్లలేదు. ఆ ఒడ్డున ఉన్న ఇంటిలోనూ తనూ ఓ భాగస్వామిలా బాధ్యతగా పారేది. నదికి అటువైపు ఇళ్ళు ఉండేవి. ఒడ్డంతా చెట్లు కప్పివేసినట్లు గా ఉండేది.

అందుకే కాబోలు, తన మహారాణీ సింహాసనం మీదనుంచి దిగి, ఆ నదీ దేవత ప్రతి ఇంటి తోటదేవత అయ్యింది. ఆ నదీ దేవత తనను తానే మరిచిపోయి, చాలా చురుకుగా, సంతోషంగా, అందరికీ వరాలు కురిపిస్తూ బిరబిరా చరచరా తిరిగేది. వాణికంఠుడి ఇల్లు కూడా ఆ నది ఒడ్డునే ఉంది.

ఆ ఒడ్డుమీది ప్రతి గుడిసెను, కొట్టాన్ని, ఆ వైపుగా వెళ్ళే పడవలవారు చూడగలిగే వారు. కానీ, తమ వ్యాపారవ్యవహారాలలో మునిగిపోయిన వారెవరైనా ఆ ఒడ్డున ఉన్న ఓ చిన్నపాపను చూసారో లేదో.

రోజువారీ పనులయ్యాక సుభా నెమ్మదిగా వచ్చి ఏటి ఒడ్డున కూర్చునేది. సరిగ్గా అప్పుడే, ఆమెకు మాట్లాడాలన్న కోరికను చుట్టూ ఉన్న ప్రకృతి తీర్చేది. ఏటి ప్రవాహపు గలగలల సవ్వడి, పల్లెకారుల కబుర్ల సందడి, పడవ నడిపేవారి పాటలు, పక్షుల కువకువలు, చెట్ల గలగలలు... వాటన్నిటికీ ఆ చిన్నారి గుండెచప్పుడు తోడయ్యేది. పలకరింపుకు పరితపించే ఆమె హృదయానికి ఆ సవ్వళ్ళు కలగలసిన ప్రకృతిధ్వని ఉపశమనం అయ్యేది.

ప్రకృతిలో నిండిన ఈ కువకువలు, గలగలలు కలగలసి ఆ మూగతల్లి భాషలా అయ్యింది. ఆ భాష సుభా పెద్దపెద్ద కనుకొలుకుల్లో నుంచి ఒలుకుతూ, ఆమె పొడవాటి కనురెప్పల వాలులో ఒక మౌనసంభాషణలా జాలువారేది. కీచురొద చేసే చెట్ల గుబుళ్ళ మీదుగా నిశ్శబ్ద తారామండలం దాకా సంభాషణ సాగేది. అన్నీ సైగలూ సంజ్ఞలే, వెక్కిళ్ళు నిట్టూర్పులే.

మిట్టమధ్యాహ్నం వేళ పడవల వారు, చేపలు పట్టేవారు భోజనం చేయడానికి వెళతారు. పల్లెవాసులంతా ఓ కునుకు తీయడం మొదలుపెడతారు. పక్షులన్నీ ఎక్కడివక్కడ ఆగిపోతాయి. ప్రయాణీకులు లేక బోసిపోయిన ఖాళీపడవలు బద్ధకంగా నిలిచిపోతాయి. పనివత్తిడిలో మహా గజిబిజిగా పరుగులెత్తే లోకం గంట కొట్టినట్లుగా, ఆకస్మాత్తుగా ఏకాంతంలోకి జారుకొంటుంది, ఏదో మాయాభూతం కమ్మినట్లుగా.

అప్పుడు స్వర్గసీమకు ఆవలగా ఒక మూగబోయిన ప్రకృతి, నిశ్శబ్దంగా కూలబడ్డ ఒక మూగపిల్ల మిగులుతారు. ఒకరు సూర్యకాంతిని ప్రసరిచేచోట, మరొకరు ఒక చిన్న చెట్టునీడలోనూ కూర్చుని ఉంటారు.

అయితే, సుభాకి స్నేహితులు లేకుండా లేరు. చావిడిలో రెండు ఆవులు ఉన్నాయి: సర్బాషి, పాంగులా. తమపేర్లను ఆమె పెదవులు పలకగా అవి వినలేదు. కానీ, వాటికి ఆమె అడుగులసవ్వడి తెలుసు. మాట్లాడలేక పోయినా, సుభా వాటితో ఆత్మీయంగా గుసగుసలాడేది. ఏ భాషనైనా మించిన ఆమె గుసగుసల మృధుభాషణ వాటికి బాగా అర్థమయ్యేది. సుభా వాటికి ప్రేమగా నిమిరినపుడు, ఆప్యాయంగా దగ్గరికి తీసుకొన్నపుడు, తిట్టినా, కసిరినా, బతిమిలాడినా, బామాలినా ఎవరికీ అర్థంకాని ఆమె మూగభాష వాటికి బాగా అర్థమయ్యేది.

సుభా చావిడి దగ్గరికి వెళ్ళి సర్బాషి మెడచుట్టూ చేతులు వేసి, ప్రేమగా నిమిరేది. తన స్నేహితురాలి దవడలను సవరదీసి, తన చెంపను ఆనించేది. సరిగ్గా అప్పుడే, పాంగులీ తన దయార్ద్ర నయనాలను సుభాపై మళ్ళించేది. సుభా ముఖాన్నంతా నాకేది.

మనసు నొప్పించే మాటలు తన చెవిన పడ్డప్పుడల్లా, సుభా నేరుగా తన మూగస్నేహితుల దగ్గరికి వచ్చేది. బహుశా సుభా ఆందోళన ఆమె ముఖాన తాండవించేదేమో, ఆ మూగజీవులు గ్రహించి, అర్థం చేసుకొన్నట్లుగా సుభాను ఓదార్చడానికి ఆత్రుతగా వేచి ఉండేవి. తమ కొమ్ములతో ఆమెను తాకుతూ, తడుతూ, తమ మూగశైలిలో ఆమెకు ఉపశమనం కలిగించే ప్రయత్నం చేసేవి. ఈ రెండు జీవాలే కాకుండా, మరికొన్ని మేకలు, ఒక పిల్లిపిల్ల ఉన్నాయి. వాటితోనూ అభిమానంగా ఉన్నా, సుభా ఆవులతో ఎక్కువ ఆత్మీయంగా వ్యవహరించేది. పగలయినా రాత్రయినా అవకాశం దొరకగానే పిల్లికూన సుభా వళ్ళోకి దూరిపోయి, గాఢనిద్రలోకి జారుకొనేది. దానిని జో కొడుతున్నట్లుగా, సుభా పిల్లికూన మెడను, వీపును నిమురుతూ ఉండేది.

సుభాకి ఉన్నత జీవరాశిలో కూడా ఒక స్నేహితుడు ఉన్నాడు. ఆ అమ్మాయికి అతనితో ఉన్న సంబంధం ఎలాంటిదో నిర్వచించడం తేలిక కాదు. అతను గోసాయిల పిల్లవాడు, ప్రతాప్. ఏ పని లేని వాడు. ఖాళీ మనిషి. ఎంతో ప్రయత్నించాక అతని అమ్మానాన్నలు, అతను ఏనాటికైనా ఏదో ఒక పనిలో పడతాడన్న ఆశను వదిలేసుకొన్నారు. అయినవారు ఒప్పుకోక పోయినా, ఇలాంటి పనిలేని పోకిరీలు పరాయివారిలో ప్రముఖంగానే చలామణి అవుతుంటారు.

ప్రతి ఊరిలోనూ కాస్త ఊపిరి పీల్చుకొనేందుకు వీలుగా, కొంత ఖాళీ స్థలం ఉన్నట్లుగానే, వారి సమయాన్నంతా అడిగినవారికి వెచ్చించగల ఇలాంటి ఏ పని లేని పెద్ద మనుషులు ఒకరిద్దరు ఉండాలి. మనం బద్దకించినపుడు తోడు కావాలంటే, ఒకరైనా సిద్ధంగా ఉంటారు.

ప్రతాప్ ఆశయం చేపలు పట్టడం. ఆ విధంగా అతను చాలా సమయాన్ని వృధాచేయగలడు, మధ్యాహ్నమంతా ఏదో ముఖ్యమైన పనిలో మునిగి ఉన్నట్లు. అలా తరుచుగా అతను సుభాను కలిసేవాడు. అతని అభిమానాన్నంతా ఆమెను పిలిచే పిలుపులో వ్యక్తపరిచేవాడు, "సు" అని పిలుస్తూ.

సుభా చింతచెట్టు కింద కూర్చుని ఉండేది. అక్కడికి కాస్త దగ్గరలో ప్రతాప్ చేపలకి గాలం వేసి కూర్చునేవాడు. ప్రతాప్ తనతో పాటు చిన్న సంబారం పట్టుకొచ్చేవాడు, లేత తమలపాకులు. సుభా వాటిని తాంబూలంగా మడిచి ఇచ్చేది.

నాకనిపిస్తుంది, చాలాసేపు అలా కదలకుండా కూర్చున్న వ్యక్తికి ఏదైనా మేలు చేయాలని అనుకొందేమో. అయితే నిజకారణం ఈ లోకంలో తానొక అప్రయోజకురాలు కాదని నిరూపించుకోవడం. సృష్టికర్తను తనకొక బ్రహ్మాండమైన అరుదైన శక్తిని ప్రసాదించమని కోరుకొంటూంది. అది ఎలాంటి ఇంద్రజాల మహత్యాన్ని చేయాలంటే, "అబ్బో! నా కలలో కూడా సు ఇలా చేసిందంటే నమ్మలేక పోతున్నా" అని ప్రతాప్ ఆశ్చర్యపోవాలి.

ఒకసారి ఊహించండి. సుభా జలదేవత అయి ఉంటే, నాగమణిని చేత బుచ్చుకొని, ఏటి నీటిలోనుంచి నెమ్మదిగా పైకి లేచి వచ్చేది. అప్పుడు ప్రతాప్ తన కంపుకొట్టే చేపలను పట్టడాని మానేసి, నాగలోకంలోకి ఎగిరి

దూకేస్తాడు. అక్కడి వెండి ప్రాసాదం లో బంగారుతల్పం పై పవళించి ఉన్న సు ని చేరుకొంటాడు. చిన్నారి మూగతల్లి, సు, ఎవరు? వాణికంఠుడి కూతురా? అవును. మన "సు" ఆ మిరుమిట్లుగొలిపే నవరత్నభరిత నగర రాజు కుమార్తె కాకపోవచ్చు. అది అసంభవం. ఏదైనా అసాధ్యం కాకపోవచ్చు కానీ, సు పాతాళపుర రాజకుటుంబంలో పుట్టలేదు. వాణికంఠుడి ఇంట్లో పుట్టింది. ఏ రకంగాను ఒక గోసాయి పిల్లవాడిని ఆశ్చర్యపరలేదు. ఆకట్టుకోలేదు.

సుభా క్రమంగా ఎదగసాగింది. క్రమంగా తనను తాను తెలుసుకోసాగింది. పున్నమి నాడు పోటెత్తిన అలలా, అవ్యక్తమైన స్పృహ ఆమెలో నిండిపోసాగింది. తనను తాను పరిశీలించుకొంది. తనను తాను ప్రశ్నించుకొంది. కానీ, ఆమెకు ఎలాంటి సమాధానం రాలేదు.

ఒకానొకరోజు పౌర్ణమినాటి రాత్రి ఆమె మెల్లిగా వెళ్ళి తలుపు తీసి, బిడియంగా తొంగిచూసింది. పౌర్ణమినాటి ప్రకృతి కూడా సుభా లాంటి ఏకాకిలా నిద్రపోతున్న భూలోకం వైపు తొంగిచూస్తోంది. ఆమెలో నుంచి పసితనం చప్పుడు చేస్తుంది. ఇక, అపరిమితమైన ఏకాంతజీవితానికి హద్దులు దాటేయాలని చూస్తోంది. వాటి పరిధులని దాటేసింది.

ఆమె గుండె బరువెక్కింది. ఆమె నోరు పెగలడం లేదు. నిశ్శబ్దపు పొరల్లో దాగిపోతోంది. దిగులుపడుతోన్న ఆమె తల్లి కూడా నిశ్శబ్దంగానే నిలబడి ఉంది.

★

ఆమె పెళ్ళి అన్న ఆలోచన అమ్మానాన్నల ఆందోళనతో నిండిపోయింది. లోకులు వారిని నిందించారు. దానితో ఆగక, వారిని వెలివేస్తామని హెచ్చరించారు. వాణికంఠుడు బాగాఉన్నవాడు. వాళ్ళు ప్రతిరోజూ రెండుపూటలా చేపలకూరతో భోజనం చేస్తారు. దాని పర్యవసానంగా అతనికి శత్రువులు తక్కువేమీ లేరు. ఇక, ఆడవాళ్ళు కూడా తోడయ్యారు. వాణికంఠుడు కొన్నాళ్ళు దూరదేశం వెళ్ళాడు. తిరిగి ఇంటికి వచ్చీ రాగానే, అన్నాడు, "మనం కలకత్తా వెళదాం."

గుండె బరువెక్కిన సుభా కళ్ళు కన్నీళ్ళతో నిండిపోయాయి, పొగ మంచుతో నిండిన తొలిపొద్దులాగా.

చిరకాలంగా సుభా గుండెల్లో పేరుకొంటున్న భయం ధృఢపడింది. మూగజీవిలా అమ్మానాన్నలను అనుకరించింది. తన పెద్దకళ్ళను మరింత విప్పార్చి, వారి ముఖాలను లోతుగా పరిశీలించేది, ఏదైనా తెలుస్తుందేమోనన్న ఆశతో. కానీ, ఒక్కమాట కూడా వారు దొర్లనీయలేదు.

వీటన్నిటి మధ్యలో ఒక మధ్యాహ్నం, ఎప్పటిలాగానే చేపలుపడుతున్న ప్రతాప్ ఫక్కున నవ్వాడు, "అయితే, సు... మీ వాళ్ళు నీకో పెళ్ళికొడుకుని వెతికారన్న మాట! నీకు త్వరలో పెళ్ళయిపోతుంది, నన్ను పూర్తిగా మరిచిపోవుగా?" తిరిగి తన చేపలు పట్టుకోవడంలో మునిగిపోయాడు.

బాణం తగిలిన పావురం వేటగాడి ముఖంలోకి చూస్తూ మౌనంగా నిలదీసినట్లుగా ప్రతాప్ వంక చూసింది, "నేను నీకేం చేశాను?" అన్నట్లుగా చూసింది. ఆ రోజు ఇక ఎప్పటిలాగా తన చెట్టు కింద కూర్చో లేకపోయింది.

వాణికంఠుడు మధ్యాహ్నం నిద్ర నుంచి లేచి, పడకగదిలోనే చుట్ట కాల్చుకొంటున్నప్పుడు, సుభా వెళ్ళి అతని పాదాల మీద కుప్పకూలింది. అతనివంక చూస్తూ గొల్లుమంది. వాణికంఠుడు ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించాడు. అతని చెంపలు కన్నీళ్ళతో తడిగట్టాయి.

మరునాడు ఉదయాన్నే కలకత్తాకు బయలుదేరాలని తీర్మానించాడు.

సుభా చావిట్లోకి వెళ్ళి, తన బాల్యమిత్రులైన ఆవులకు వీడ్కోలు పలికింది. తన చేతులతో వాటినోటికి గడ్డిని అందించింది. వాటి మెడలను నిమిరింది. వాటి ముఖాలను ఆరిపారచూసింది. ఆమె కళ్ళల్లోంచి ఉబికివస్తోన్న కన్నీళ్ళే ఆమె మాట్లాడ దలుచుకొన్నవన్నీ చెప్పేసాయి.

ఆ రాత్రి దశమి. సుభా తన గదిలో నుంచి బయటకు వెళ్ళింది. ఏటి ఒడ్డున పచ్చిక బయళ్ళలో బోర్లాపడుకొంది, ఆమె చేతులతో భూమాతను ఆలింగనం చేసుకొన్నట్లుగా. సుభాకు ఆమె కనబడని అమ్మ. ధృఢమైన మౌనానికి ప్రతీక అయిన భూదేవమ్మతో చెప్పింది, "నన్ను వదిలేయవద్దమ్మా.. నేను వేసినట్లుగానే, నీ చేతులు నా చుట్టూ వేయి. నన్ను పొదివిపట్టుకో, గట్టిగా!"

ఒకరోజు వారి కలకత్తా ఇంటిలో, సుభాతల్లి సుభాను శ్రద్ధగా తయారు చేసింది. సుభా జుట్టు దువ్వి లేసులతో అలంకరించింది. నగలెన్నో దిగేసింది. సుభా సహజసౌందర్యాన్ని చంపడానికి ఏమేమి చేయవచ్చునో, అన్నీ చేసింది.

సుభా కళ్ళు నీళ్ళతో నిండి ఉన్నాయి. ఏడ్చి ఏడ్చి కళ్ళు ఉబ్బిపోతాయేమోనని వాళ్ళమ్మ గట్టిగా తిట్టింది. కానీ, ఆమె కన్నీళ్ళు తిట్లను పట్టించుకోలేదు.

పెళ్ళికొడుకు అతని స్నేహితుడితో పాటు కలిసి వచ్చాడు, పెళ్ళికూతురిని పరీక్షించడానికి. ఆమె తల్లిదండ్రులు భయాందోళనతో వణికిపోతున్నారు, స్వయంగా దేవుడే బలిపశువుని ఎంపిక చేసుకోవడానికి వచ్చినట్లుగా ఉంది. సుభా తల్లి తెర వెనకాల చేరి, పరీక్షాధికారి ముందుకు పంపే ముందు ఎలా ప్రవర్తించాలో ఆజ్ఞాపించసాగింది.

చాలాసేపు నఖశిఖపర్యంతరం పరిశీలించాక ఆ మహానుభావుడు వ్యాఖ్యానించాడు, "అంత దారుణంగా లేదు." పైనుంచి, సుభా కన్నీళ్ళను అతను ప్రత్యేకతగా భావించాడు. ఆమెది సున్నితమైన మనస్సు అనుకొన్నాడు. దానిని ఆమె లెక్కలో జమ చేశాడు. అమ్మానాన్నలను వదలడానికి బాధ పడుతుందంటే, పనికొచ్చే మంచి పొందు అనుకొన్నాడు. ఆణిముత్యాల విలువలాగా ఆ బాలిక కన్నీళ్ళు ఆమె విలువను పెంచాయి. అతనిక ఏ వ్యాఖ్యానం చేయలేదు

ముహూర్తాలు చూసు కొన్నారు. ఒక మంచి రోజున పెళ్ళి అయిపోయింది. వాళ్ళ పుట్టుమూగ పిల్లను మరొక అయ్య చేతిలో పెట్టి, అమ్మానాన్నలు ఊరికి తిరిగి వెళ్ళారు. ధన్యవాదాలు దేవుడా! వారి కులం నిలబడింది. పై లోకాలలో వారి స్థానం ఖాయం అయింది.

ఆ పెళ్ళికొడుకు పనిజేసేది పడమరన. పెళ్ళయిన వెంటనే సుభాను అక్కడికి తీసుకువెళ్ళాడు. వారం పదిరోజులలోనే, పెళ్ళి కూతురు మూగదని బయటపడింది. ఎవరేమి చేసినా ఆమె మాత్రం మోసం చేయలేదు. ఆమె కళ్ళు అంతా చెప్పాయి. కానీ, ఆమెను ఎవరూ అర్థం చేసుకోలేదు. ప్రతి చెయ్యి వంకా చూసింది. ఆమెకు ఏ ఒక్క మాట కనబడలేదు. ఆ మూగతల్లి తన మూగబాసను అర్థం చేసుకొనే తెలిసిన ముఖాలు ఒక్కటి కూడా ఎక్కడా కనబడలేదు. ఆమె నిశ్శబ్ద హృదయం, అంతులేని చప్పుడులేని దుఃఖం వినబడుతోంది. హృదయాన్వేషకులకి మాత్రమే అది వినబడుతుంది!

★

## అనుసృజకుల వ్యాఖ్యానం

'మాట మూగబోయినా మనసు మూగది కాదు కదా' అని అనిపిస్తుంది సుభా కథ చదవగానే. తాను చేయని తప్పుకి ఒక బలిపీఠం ఎక్కినట్లయిన ఇరువురి జీవితాల కథ. ప్రత్యక్షంగా సుభా కథ అయితే, పరోక్షంగా ఆ యువ వరుడి కథ కూడా. అన్నీ తనకే తెలుసు అనుకొనే అమాయక నవతరపు నయా ప్రతినిధి అయిన ఆ వరుడి తరం పై వేసిన చురక ఈ కథ.

అంతే కాదు, అది కన్నబిడ్డ పుట్టుకతో వచ్చిన లోపాన్ని తన శారీరక లోపంగా భావించి, ఆ బిడ్డనే దూరం చేసుకోవాల్సి వచ్చిన తల్లి కథ కూడా. ఆనాటి సంకుచిత సామాజిక విలువల్లో, పెళ్ళి చుట్టూ అల్లుకొన్న ప్రాధాన్యతలు, బాగోగుల విచక్షణకు తావివ్వని పెద్దల అనాలోచిత నిర్ణయాలకు తల ఒగ్గి, తన ప్రమేయంలేకుండానే జీవిత బలిపీఠం ఎక్కిన సుకుమార బాలిక కథ ఇది. అందులోనూ, తన భావోద్వేగాలను నోరువిప్పి చెప్పుకోలేని పుట్టుమూగ బాలిక కథ, సుభా.

సుభా జీవితంలోని తదుపరి ఘట్టాలను చదువరుల ఊహకే వదలారు టాగోర్ మహాశయుడు. ఈ ముగింపులేని సుభా కథే ఆనాటి బాధ్యాతారహిత సామాజికులపై ఛెళ్ళున విసిరిన కొరడా దెబ్బ. ఈ కథ చదివాక కళ్లు చెమ్మగిల్లక పోతే, గుండె మెలిపెట్టకపోతే, తల వాలకపోతే, మనమూ ఏ కాలాల్లో చిక్కుకుపోయి ఉన్నామో తేల్చుకొని, ఒకసారి భుజాలు తడుముకోవాల్సిందే!

References:
https://www.google.com/search?q=tagore+story+subha&rlz=1C1JZAP_enUS984US984&oq=tagore+story+subha+&gs_lcrp=EgZjaHJvbWUyBggAEEUYOdIBCDY5MTlqMGo3qAIIsAIB&sourceid=chrome&ie=UTF-8#fpstate=ive&vld=cid:38ef6792,vid:8Hzk2xQ02MQ,st:0